


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -164-

**(21 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**కొందరు** పెద్ద మనుష్యులు భార్యను చీరల దుకాణానికి తీసుకుపోయి చీరకొనుక్కోమంటారు. ఆవిడ ఎలాటి చీర తీసి చూపించినా "నీ యిష్టం" అంటూ వుంటారు.

"అబ్బా మీరు చెప్పండి అని ఆవిడ ఒక నాజూకు చూపు చూసి, తాజా నవ్వునవ్వుతుంది. దానితో ఆయనగారు మరింత ఉక్కిరిబిక్కిరి అయి "నీ యిష్టమన్నాగా, బాగుంటే తీసుకో" అని చిరునవ్వు నవ్వుతాడు.

ఇద్దరూ కాసేపు మౌనంగా వుండటం తటిస్థిస్తుంది. ఆ మౌనంలో ఏవో వెనకటి బాసలు మోసులెత్తినట్లవుతుంది. ఈ పరదాల వరదలో ఆవిడగారు అనుకున్న ఖరీదుకంటే ఇంకో పాతిక రూపాయలు ఎక్కువ ఖరీదుగల చీరే తీసుకుంటుంది. ఆయన ముఖంలో మునిమాపు నీరెండలు ప్రాకుతాయి.

ఆయనగారు 'నీ యిష్టం - నీ యిష్టం' అనడంలో అంతరార్థం 'తన యిష్టం' గుర్తించమనే తాత్పర్యమున్నదనుకుంటాడు. ఆవిడ మనసు క్రొత్త చీరమీదకు పరుగులు తీసినట్లుగా భర్త చిత్తవృత్తికి పోదు పాపం.

ఆడపిల్లను అత్తవారింటికి పంపేటప్పుడు, భర్త ఇష్టాలూ, అత్తమామల ఇష్టాలూ తెలుసుకుని ప్రవర్తించమని బోధించి పంపుతూ వుంటారు. దీనిమీద ఒక పాటకూడా వుంది. అత్తవారింటికి ఒకసారి వెళ్ళివచ్చిన తల్లికి కూతురుకి మధ్య జరిగిన సంభాషణ.

"పాలించి, లాలించు
భర్తకే మిష్టమ్ము...
సేవ చేసిన వేళ
ఛీత్కార మిష్టమ్ము...
గొప్పలు చెప్పుకోని
కులుక లిష్టమ్ము..."

"పెత్తనము సాగించు
అత్తకే మిష్టము"
"నెయ్యంబు నెరుగుదు
తియ్యమ్ము నెరుగదు
వియ్యమే ఎందని
వింత మనిషే సుమ
అత్తయ్యకేవేళ
విరుపు లిలిష్టమ్ము...
కాసంత దానికే
కంటి మెరుపు ఇష్టమ్ము
పుట్టింటినే మరచి
తన పుట్టుకునే మరచి
నట్టింట రౌద్రాన
నాట్య మిష్టమ్ము...

ఇలా మామగారి ఇష్టాన్ని గురించి, మరుదుల ఇష్టాన్ని గురించి, చిట్ట చివరకు ఆడబడుచుల ఇష్టాన్ని గురించి వర్ణిస్తుందీపాట.. ఏ ఒక్కరూ తనతో యిష్టంగా వుండరనేదే పాట పర్యవసానం.

పూర్వం తల్లిదండ్రులు తనకు నచ్చిన పిల్లను వెతికి తెచ్చి కుమారుడికిచ్చి వివాహం చేసేవారు. కుమారుడు మూగవాడల్లే పిల్లకు మూడు ముళ్ళూ వేసేవాడు.

నాకు ఒక సంబంధం చూచి వచ్చారు మా నాన్నగారు. నేనా రోజులో కొంచెం పిక్కిపిక్కి కవిత్వం వ్రాస్తూ వుండేవాణ్ణి. ఏవో కొన్ని స్వతంత్ర భావాలు నాలో వున్నాయనే పిచ్చి ఊహ కలిగింది. అందువల్ల కొంచెం భయపడుతూనే "ఒక్కసారి ఆ పిల్లను చూద్దామని వుంది" అన్నాను.

ఆయనగారికి ఎంతో కోపం వచ్చింది. అలా అనడం అవమానంగా తోచింది.

ఏమిటి నువ్వు చూస్తావా? నువ్వు ఇష్టపడాలా?" అన్నారు

"మీ యిష్టమే కాని ఒక్కసారి చూడాలని వుంది. అంతే" అన్నాను వణికిపోతూ.

"నువ్వు చూసి చేసుకోవాలంటే నే పోయిన తర్వాత చేసుకో.. అందాకా కొంచెం వోపిక పట్టు. నీ యిష్టం ప్రకారం పిల్లను వెతుక్కోవచ్చు. పడుచు గొప్పా? ప్రతిష్ట గొప్పా?" అన్నారు. నేను దణ్ణం పెట్టి ఊరుకున్నాను.

"ఇప్పుడిలాంటి పద్ధతులన్నీ మారిపోయాయి. పిల్లాడు తనకిష్టమైన పిల్లను వెతుక్కుంటే తల్లితండ్రులు నలుగురితోపాటు తరలి వెడుతున్నారు. కొందరు తల్లితండ్రులకు లగ్నం పెట్టేదాకా కూడా తెలియడంలేదు.

మొన్న ఒక మహా కవికి కొడుకు దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందిట. "నేను ఫలానా వారి అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి అంటే నాకెంతో యిష్టం. వాళ్ళు నాన్న లగ్నం పెట్టించి, పెళ్ళి ఏర్పాట్లు చేస్తున్నాడు. మీకు తీరుబడి వుంటే లగ్నానికి వచ్చి దీవించండి. లేకపోతే పోస్టులో పంపించండి" అని.

"పిల్ల ఇష్టంతో పోలా లగ్నం, పెళ్ళి అన్నీ కూడా వాడి యిష్టప్రకారమే జరుగుతున్నాయి. ఆ సమయానికి దిష్టిబొమ్మలాగా నన్ను రమ్మని వ్రాశాడు. ప్రతివాడి పనీ ఇష్టారాజ్యంగావుంది" అని ఆ పండితుడు గుండెలు బాదుకున్నాడుట.

ఇష్టాలలో మళ్ళీ మామూలు ఇష్టాలు కాదు చాలా గట్టి గట్టి యిష్టాలేర్పడుతున్నాయి. వాటికి సవరణలు పనికిరావు. యిలా ఏర్పడ్డ ఇష్టం అలా నెరవేరి తీరవలసింది.

సినిమాకు వెళ్ళాలి డబ్బు లివ్వమని పోట్లాడే కుర్రవాడి ఇష్టాన్ని మరలించడం ఎవరితరం కావడంలేదు. ఇవ్వాళ వెళ్ళి తీరవలసిందే. ఎంత వాన కురిసినా వెళ్ళవలసిందే అని ఉరించడం తప్ప. మరో మాట ఉండటంలేదు. చివరకు తప్పనిసరిగా డబ్బులు చేతిలో పెట్టి "పోనీ ఆ వెళ్ళేది మరో సినిమాకు వెళ్ళు. ఆ స్టంటు చిత్రాలకు వెళ్ళకు. రాత్రిళ్ళు కలవరిస్తున్నావు అంటే –

"అవే నాకిష్టం. తక్కిన వాటిల్లో ఏం వుంది. మామూలు కథలేగా. అన్నీ ఒక మాదిరిగానే వుంటాయి. ఒకటే ప్రేమ. స్టంటుల్లో కొంత పౌరుషం వుంది .అక్కడికే వెడతాను" అని గట్టిగా చెప్పి బయలుదేరతాడు కుర్రవాడు. వద్దంటే ఇంట్లోనే స్టంటు బయలుదేరుతుందని తల్లితండ్రులు కిమ్మనకుండా వూరుకోవాల్సిందే.

పెద్దలకు నమస్కరిస్తే "ఇష్ట ఫల సిద్ధిరస్తు" అంటూ వుండేవారు. అయితే వారి అభిప్రాయంలో ఇష్టాలంటే దర్మార్ధ కామ మోక్షాలనుకునేవారు. ఇప్పుడు ఇష్టాల స్వరూపాలు మారినాయి గనుక అలాటి దీవెనలు తరిగిపోతున్నాయి.

'ఒక కోడల్ని అత్తగారు అడిగిందిట. ఇంత చిన్నతం నుంచీ నీకు ఇష్టాలేమిటమ్మా' కొంచెం పెద్దదానివి కావాలి. సంతానం కలగాలి. ఇప్పుడు నీ యిష్టాలన్నీ సంసార యోగ్యంగా, ధర్మ యుక్తంగా వుండాలిగాని – స్వతంత్ర వాంఛలుగా వుండకూడదు" అని.

కోడలికి ఎక్కడలేని కోపం వచ్చిందిట. "ఇష్టాలకు వయస్సేమిటి? ఇష్టాలు సృష్టిలోనే వున్నాయనే విషయం తెలియదూ. అందులో ఏ వయసులో ఇష్టాలు ఆ వయస్సులో వుంటాయి. ఇప్పటి మెరుపులూ, ముచ్చటలూ, ముసలితనంలో చూచుకోమంటావేమిటి వయస్సు వెనక్కు వెళ్ళమంటే వెడుతుందా? నిజానికి నాకెన్నో ఇష్టాలున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు తీర్చుకోకపోతే కుప్పలు పడిపోతాయి. ఆ తిప్పలు మీకేం తెలుస్తాయి?

ఇష్టాలన్నీ తీరి కృష్ణా రామా అనుకుంటూ కూర్చునే మీకు నా యిష్టాల సంగతేం తెలుస్తుంది. అభీష్టాలు తీరని జీవితం. ఎడారి తులసిలాగా అయిపోతుంది. నాకు సినిమా కష్టం.. క్లబ్ ఇష్టం. కవిత్వాలిష్టం. నాట్యాలిష్టం. నవ్వుకుంటూ తిరగడం ఇష్టం. ఇంట్లో పనిచేయకుండా రెస్టు తీసుకోవడం ఇష్టం. ఇంకా ఎన్నో వున్నాయి. ఇవన్నీ మీకు చెప్పాలా ఏమిటి? " అని కోడలు గుడ్లు ఉరిమింది.

అత్తకు చిత్త స్వాస్థ్యం తప్పి బిత్తరపోతూ, దొడ్లోకి పోయి బీర పాదు చాటు ఉదయిస్తున్న సూర్యుడికో నమస్కారం చేసిందిట.

Post your comments